క్లుప్తంగా

నీటిని మళ్లిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోండి

కొందుర్గు: చెరువులో నుంచి అక్రమంగా నీళ్లు తీసుకెళ్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన జంబుల పెద్ద యాదయ్య గ్రామ శివారులోని కర్ణం కుంటలో మోటర్ అమర్చి తన వ్యవసాయ పొలానికి నీళ్లు మళ్లిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో కుంటలో నీళ్లు అయిపోయి పశువులకు తాగడానికి కూడా నీళ్లు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇదివరకే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన రాజు (28) అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ సోమవారం మృతిచెందాడు. మంగళవారం శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ అంజిరెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం రూ.2500 ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోసర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, తిరుమలేశ్ తదితరులు నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈనెల 14న గునుగల్‌లో నిర్వహించే అంబేద్కర్ జయంతిని ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా అంబేద్కర్ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరింపజేశారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు నివాళి



రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: సీపీఐ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు వర్ధంతిని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని రావినారాయణరెడ్డి కాలనీలో మంగళవారం సీపీఐ నాయకులు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి మాట్లాడుతూ... రాజేశ్వర్‌రావు పేదల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, నిజాం నిరంకుశత్వానికి, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు హరిసింగ్ నాయక్, నవనీత, అరుణ, పుల్లయ్య, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

12న బసవేశ్వర విగ్రహావిష్కరణ

మంచాల: ఈనెల 12న మంచాలలోని శ్రీ బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మండల అధ్యక్షుడు కొత్తూర్ శేఖరప్ప తెలిపారు. మంగళవారం మంచాలలో విగ్రహావిష్కరణ కార్యక్రమ పనులను ఆయన పరిశీలించారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తదనంతరం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని వీర శైవ బంధుమిత్రులు, సంఘం సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు. ఆ సంఘం నాయకులు హరీష్, నాగభూషణ్, రాజప్ప, శివకుమార్, పెంటప్ప, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని ఐనాపూర్ గ్రామ సమీపంలోని షిరిడి సాయిబాబా ఆలయ సప్తమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు చేయడంతో పాటు లక్ష్మీ గణపతి సహ సకల దేవతా హోమాలు చేపట్టారు. అనంతరం సాయిబాబా పల్లకీ సేవ చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

షడ్రుచుల ఉగాది

క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలను మంగళవారం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి క్యూలైన్లో నిల్చున్నారు. సాయంత్రం వేద పండితులు పంచాగ శ్రవణం నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం, వాసవి కన్యకాపరమేశ్వరి, రమాసహిత సత్యనారాయణ స్వామి, సాయిబాబా, ఉత్తర రామేశ్వరంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో పంచాంగం చదువుతున్న పంతులు సురేశ్



షాద్‌నగర్: హిందువాహిని ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



షాబాద్: రుద్రారంలో పంచాంగం వినిపిస్తున్న పండితులు



చేవెళ్ల: కొత్త కుండ కొంటున్న వినియోగదారుడు



మొయినాబాద్ రూరల్: హనుమాన్ దేవాలయంలో



కొందుర్గు: పెండ్యాల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో



మొయినాబాద్ రూరల్: పచ్చడి పంపిణీ చేస్తున్న నర్సింహాచారి



మొయినాబాద్: పంచాంగం ఆవిష్కరిస్తున్న పవన్‌కుమార్‌రెడ్డి



నందిగామ: నర్సప్పగూడలో పంచాంగాన్ని వింటున్న గ్రామస్తులు



మొయినాబాద్: పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

కొత్త ఆశల ఉగాది

ఘనంగా పండుగ జరుపుకొన్న ప్రజలు

ఆలయాలు, చావిడీల వద్ద పంచాంగ శ్రవణం

నోరూరించిన భక్ష్యాలు, పిండివంటలు

షాబాద్: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పండుగ నాడు పంచాంగం వినడం గ్రామీణ ప్రాంతాల్లో తప్పని సరి. మారుతున్న సంస్కృతితో ఇప్పుడు పంచాంగ శ్రావణం టీవీలకే పరిమితమవుతోంది. గుడికి వెళ్లి పండితుల ద్వారా సంవత్సర ఫలితం తెలుసుకునే వారి సంఖ్య తక్కువవుతోంది. ఒకప్పుడు కేవలం నగరాల్లో ఉండే ఈ పరిస్థితి, ఇప్పుడు శివారులోని చిన్న చిన్న పట్టణాలకు పాకింది. షాబాద్ ప్రాంతం రికార్డుల పరంగా గ్రామీణ ప్రాంతమే అయినప్పటికి పట్టణీకరణతో ఇక్కడి పరిస్థితి కూడా మారింది.

మంచి చెడుల దిక్సూచీ...



ఉగాది పండుగ రోజున పంచాంగ శ్రవణం తరతరాల సంప్రదాయం. పంచాంగం మంచి, చెడులకు దిక్సూచీ లాంటింది. ఆయా రాశుల వారికి సంవత్సరమంతా ఎలా ఉండబోతుందో ఇది వివరిస్తుంది. శుభాశుభాలనేవి గ్రహాల సంచారం బట్టి ఉంటుంది. కొందరికి సంవత్సరమంతా లాభదాయకంగా, మరికొందరికి మిశ్రమంగా, ఇంకొందరికి ఇబ్బందికరంగా ఉండొచ్చు. ఇది వారివారి నమ్మకం మీద ఉంటుంది. జ్యోతిషుల సూచనల మేరకు జపాలు, దానాలతో కొన్ని బాధల నుంచి ఉపశమనం పొందొచ్చు.

– శ్రీను పంతులు, షాబాద్

పండుగ స్పెషల్ భక్ష్యాలు...



ఉగాది పండుగ అంటేనే అందరికి గుర్తొచ్చేది. భక్ష్యాలు(పోలెలు), ఉగాది పచ్చడి ఎంత తప్పనిసరో భక్ష్యాలకూ అంతే ప్రాధాన్యమిస్తారు. పండుగకు ఒకరోజుముందే ఈ తీపి వంటకాన్ని సిద్ధం చేస్తారు. ముందుగా శనగపప్పు, పంచదారను గ్రైండర్‌లో రుబ్బి పూర్ణంగా మారుస్తారు. అనంతరం గోధుమపిండిని తడిపి చిన్నచిన్న ముద్దలు తయారుచేస్తారు. వీటిని పూరిల్లా ఒత్తుకుంటూ పంచదార పూర్ణాన్ని జోడిస్తారు. పెనంపై వేసి కొద్దికొద్దిగా నెయ్యివేసి కాలిస్తే తియ్య తియ్యని భక్ష్యాలు సిద్ధమవుతాయి.

– సుబ్రమణ్వేశ్వరి, గృహిణి, షాబాద్

ఇక్కడా ఆనందంగానే...



మాది షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామం. ఉగాది పండగా ఊళ్లో ఎలా జరుపుకునేవాళ్లమో ఇక్కడ కూడా అంతే ఆనందంగా జరుపుకొంటున్నాం. మా చిన్నతనంలో ఉగాది పండుగకు ఒక ఏడాది అమ్మమ్మ, మరో ఏడాది నాన్నమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. బంధువులు, సన్నిహితులతో ఎంతో ఆనందంగా గడిపే వాళ్లం. ఈ మూడెళ్ల నుంచి ఇక్కడ కూడా పండుగ అంతే సంతోషంగా జరుపుకుంటున్నాం. చుట్టుప్రక్కల వారందరూ ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తారు.

– స్వరూ, గృహిణి, సర్దార్‌నగర్

విద్యార్థుల గొంతుక ఎన్‌ఎస్‌యూఐ

- టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం



కడ్తాల్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎన్ఎస్‌యూఐది అత్యంత కీలక పాత్ర అని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఎన్ఎస్‌యూఐ జెండా ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యలపై ఎన్ఎస్‌యూఐ నిరంతరం పోరాడుతుందన్నారు. విద్యార్థుల గొంతుక ఎన్ఎస్‌యూఐ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కిసాన్ సెల్ నాయకులు షాబుద్దీన్, బాల్‌రాజ్, హీరాసింగ్, భానుకిరణ్, రాజేశ్, శ్రీకాంత్, భరత్, తులసీరాం, శ్రీను, శ్రీకాంత్, వినోద్, మహేశ్, కృష్ణ, యశ్వంత్ మహేందర్, ప్రవీణ్, పవన్, శేఖర్ ఉన్నారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ కల్వకుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫిరోజ్, నాయకులు శివ, శ్రీకాంత్, సాయికుమార్, కిరణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రియాజ్

బడంగ్‌పేట్: చేవేళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా మాజీ మైనార్టీ చైర్మన్ మహమ్మద్ రియాజ్ ఖాన్ కాంగ్రెస్ గూటికి చేరారు. రియాజ్‌కు పార్టీ కండువా కప్పి రంజిత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో బడంగ్‌పేట గ్రేటర్ పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ మైనార్టీ చైర్మన్ మరియు మహేశ్వరం నియోజకవర్గ మైనార్టీ అబ్జర్వర్ సయ్యద్ అఫ్జల్, అహ్మద్, బాబా భాయ్ తదితరులున్నారు.

వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి



నియామక పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

- కర్నె శివప్రసాద్
- చేవెళ్లలో మండల కమిటీ సమావేశం

చేవెళ్ల: వీరశైవ లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని సంఘం మండల నూతన అధ్యక్షుడిగా నియామకమైన కర్నె శివప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా వీరశైవలింగాయత్‌ల ఆరాధ్యదైవం బసవేశ్వరుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మండల ఘంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులంతా కలిసి అధ్యక్షుడిగా కర్నె శివప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘం సభ్యులంతా ఏకతాటిపై సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీరే మండల నూతన కమిటీ సభ్యులు..

వీరశైవలింగాయత్ సంఘం నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జె. వీరేశం(కుమ్మెర), ప్రధాన కార్యదర్శి జంగం ప్రసాద్(ఊరేళ్ల), కోశాధికారి కె వీరరేశం(ఊరేళ్ల), కార్యదర్శిగా కె విశ్వనాథం(కందవాడ), గౌరవ అధ్యక్షుడిగా ఎం ప్రభులింగం(చేవెళ్ల), నాగేంద్రబాబు (ఊరేళ్ల), సలహాదారులుగా జె శివనాందం (చనువెల్లి), కె రమేశ్(ఊరేళ్ల), కార్యవర్గ సభ్యులుగా సంఘమేశ్వర్, కె రాజు, రామలింగప్ప, భద్రప్ప, తుమ్మపల్లి వినయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాద్గుల: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాద్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అందుగుల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ చెన్నయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో, తెలుగు సంవత్స రం ఉగాది కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు



చలివేంద్రం ప్రారంభించిన సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సత్యసాయిబాబా సేవాసమితి సభ్యులు

- చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి
- సత్యసాయిబాబా చూపిన మార్గం అనుసరణీయం

చేవెళ్ల: దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని సీఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సేవా సమితి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎండల తీవ్రతకు బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారికి, ఇతర పనులపై ప్రయాణం చేస్తున్నవారికి రోడ్డుపై ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలతో దాహాన్ని తీర్చుకోవచ్చన్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా ఎదో ఒక సహాయం అందించాలని కోరారు. భగవాన్ శ్రీసత్య సాయిబాబా కూడా ఎంతో మందికి తన ట్రస్టు ద్వారా సేవలు అందించే ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సత్యసాయిబాబా చూపించిన మార్గాలు అందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సేవా సమితి సభ్యులు గోపాలచారి, రామగౌడ్, భాస్కర్, పెంటారెడ్డి, వెంకటస్వామి, విఠల్, శంకర్, మధుసూదన్, చేవెళ్ల శాఖ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



సురంగల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో వెంకట్‌రెడ్డి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి

మొయినాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా మజీద్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ఎంతో పవిత్రమైందన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, ఎండీ ఆజం, అమీర్, షఫీ, ఇక్బాల్, లతీఫ్, అతిక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందిస్తాం

అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ



ఔట్ పేషంట్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న మాధవన్‌జీ

మహేశ్వరం: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొహబ్బత్‌నగర్ సమీపంలోని భగవతిపురంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య ధామ్ ఔట్ పేషంట్ ఆస్పత్రి బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ, గిరిజన తండాల్లో ఉన్న పేదలకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు చేస్తామన్నారు. ఆరోగ్య ధామ్ పేరిట మాధవన్‌జీ ఆస్పత్రి, ఆయుర్వేదిక్, యూనాని, హోమియో, వెల్‌నెస్, యోగా శిక్షణ, ఆయుష్ కేంద్రం, ఆయుష్ పరిశోధన కేంద్రం, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజ్, ల్యాబ్స్, ఫిజియోథెరపీ కాలేజి, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, అంబులెన్స్ సేవలను భగవతిపురంలో దశలవారీగా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు, ఆస్పత్రి హెడ్ డా.కేతన్, వరుణ్, వెంకన్న, వైద్యులు పాల్గొన్నారు.